




గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్లో 1,050 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము.

# శతాబ్దాల తెలుగు పత్రికలు తీరుతెన్నులు

## -4-

ఈ భాగంలో 1917 తర్వాత ప్రారంభం అయిన కొన్ని పత్రికల గురించి తెలుసుకుందాం. 1919 ఫిబ్రవరి 28వ తేదీన వీరేశలింగంగారి అధ్యక్షతన "వర్తమాన ఆంధ్ర భాషా ప్రవర్తక సమాజం"అనే ఒక సంస్థను ప్రారంభించారు. ఆ సంస్థ తరపున గిడుగు రామ్మూర్తి పంతులు గారి సంపాదకత్వంలో 1919 సెప్టెంబర్ నుంచి ఒక చారిత్రాత్మకమైన పత్రిక ప్రారంభం అయింది దాని పేరు "తెలుగు". అది మాస పత్రిక. అప్పట్లో గిడుగు వారు పర్లాకిమిడిలో ఉండేవారు. అక్కడ నుండే ఈ 'తెలుగు' అనే పత్రికను ప్రారంభించారు. మొట్ట మొదటి సంచికలోనే "దేశంలోని అనేక పత్రికలూ ఉండగా మళ్ళీ ఈ కొత్త పత్రిక ఎందుకు?" అనే దానికి వివరణ ఇస్తూ ఆ సంపాదకీయంలో ఇలా రాశారు.

"నిజమే అనేక పత్రికలున్నవి. పత్రికాధిపతులూ, సంపాదకులూ చాలా కష్టపడి, ధనం ఖర్చు పెట్టి, ప్రజలకు అనేక విధాల ఉపకారానికి ప్రయత్నిస్తున్నారు. వారి ఉద్దేశ్యం మంచిదే. వారి ఉద్యమం కొనియాడదగినదే. వారి

ఉద్దేశ్యం సరిగా నెరవేరలేదనియూ, వారి ఉద్యమం పూర్ణంగా ఫలించకుండా, కొంత మట్టుకు అయినా వ్యర్థమవుతున్నదని మాకు అనిపిస్తున్నది. అలాగే పుస్తకాలూ రాస్తున్న ఉద్యమం కూడా సార్ధకం కావడం లేదు.

వ్యర్థంగా ధనం వెచ్చించడం కూడదని అంటారు కదా! ధనం కంటే ఎక్కువ విలువగల దేహ బలమూ, బుద్ధి బలమూ వ్యర్ధంగా వెచ్చించడం ఎంత కీడో కదా! లోక వ్యవహారమున, తేట తెలుగున, నలుగురు వాడుకునే మాటలతో చెబితే,బాధ పడే విషయం కూడా, వాడుకలో లేని మాటలతో చెబితే, వృధా ప్రయాస కదా! దాని వలన ఏమైనా లాభం వుందా? లేదని తెలిసిన చాలా మంది వ్యర్థముగా తాము ఆయాసపడి, చదివేవారిని ఆయాస పెడుతున్నారు. ఈ పత్రికలో మొట్ట మొదట చర్చించే విషయం వ్యవహారిక భాష, దాని ప్రవృత్తి, దాని ఉపయోగమూ, దాని గౌరవమూ, దాన్ని ఉపేక్షించడమూ ఇందువల్ల దేశానికి కలుగుతున్న నష్టము.”

గిడుగు రామ్మూర్తి పంతులు గారు ఇంత స్పష్టంగా తాను ప్రారంభిస్తున్న “తెలుగు” అనే పత్రిక యొక్క ఆశయాన్ని మొట్ట మొదటి సంచికలోనే చెప్పారు. ఈ పత్రిక ద్వారా ఆయన చేసినటువంటి కార్యక్రమం గ్రాంధిక వాదుల్ని రెచ్చగొట్టడం.

“గ్రాంథిక వాదులైన పండితులు భాషా స్వరూపం తెలియని వాళ్ళు. వాళ్ళ భాష సలక్షణం కాదు.“ అని గిడుగు వారు ఈ పత్రిక ద్వారా నిరూపించడానికి ప్రయత్నించారు. “ఆంధ్ర పండితుల భిషక్కుల భాషా భేషజం”అనే శీర్షికలో పండితులు చేస్తున్న అపప్రయోగాలను చూపించారు. ఆ తర్వాత ఆ వ్యాసాలన్నిటినీ ఒక పుస్తక రూపంలో కూడా వేశారు. ఈ “తెలుగు” పత్రిక ముఖచిత్రం లోనే “రాజశేఖరుని కావ్య వీవంశుని “అని ఒక సూక్తిని వేశారు. దానికి తెలుగు అర్ధం ఏమిటంటే...

“సంస్కృతం గొప్ప భాషే. అందుకు సందేహం లేదు. అయితే, సరసుడైన వాడు తన సిగలో తులసి మాల ధరిస్తాడా? జాజి పూలు ధరిస్తాడా? చెప్పండి. అలాగే, ప్రాకృతానికి వున్న సౌందర్యం, లాలిత్యం, సంస్కృతానికి ఎక్కడివి? ప్రాకృతమే మాకు ఇష్టం”అని దాని అర్ధం. గిడుగు రామ్మూర్తి పంతులు గారు తన తెలుగు పత్రిక ద్వారా ఎంతో గాఢంగా వ్యవహారిక భాష ఉపయోగాన్ని సమర్ధించడం వల్ల, “ఇలా రాస్తే మంచిది కాదేమో? పాండిత్యం అంటే, గ్రాంథికంలోనే వ్రాయలేమో?” అనుకునే వాళ్ళ బెదురు పోయేలా చేశారు. “వాడుక భాషలో స్వేచ్ఛగా వ్రాయవచ్చు” అనే నమ్మకం కలిగించారు గిడుగు వారు. ఇందువల్ల వ్యాకరణ భయం లేకుండా వచన రచన కొనసాగింది.

గిడుగు రామ్మూర్తి పంతులు గారు ఈ పత్రిక ప్రారంభించాక ఆయన – ఆంధ్ర ప్రాంతం అంతటా పర్యటించి, ఈ భాష గురించి, భాష వాడుక గురించి, భాష పుట్టుక గురించి, మాండలీకాల గురించి సమాచారాన్ని సేకరించి ఈ పత్రికలో ప్రచురించాలి అనుకున్నారు. అయితే ఈ పత్రిక కేవలం భాషా శాస్త్ర పత్రిక కాబట్టి, మాములు పాఠకుల్ని

ఎక్కువగా చేర లేకపోయింది. వాళ్ళు అంతగా ఆదరించలేదు. అందుకనే ఇది ఏడాది మించి కొనసాగలేదు. పైగా ఆర్థిక ఇబ్బందులు, గిడుగు వారు వ్యవహారిక భాషా ఉద్యమ కార్యక్రమాల్లో తీరిక లేకుండా ఉండడం, వీటన్నిటివల్ల ఈ "తెలుగు" పత్రిక ఏడాది మించి కొనసాగలేకపోయింది.

అయితే, దీనివల్ల జరిగిన ఇంకో ఉపయోగం ఏమిటంటే, ఈ తెలుగు పత్రికను చదివి ఉత్సాహవంతులైన యువకులు "సాహితీ సమితి"అనే ఒక సంస్థను స్థాపించారు. దానికి గిడుగు వారిని గౌరవ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఆ సాహితీ సమితి తరపున 1919 లో "సాహితి"అనే పత్రికను ప్రారంభించారు. అది కూడా ఏడాది మించి కొనసాగలేకపోయింది. ఇది ఈ 'తెలుగు' పత్రిక విశేషాలు.

అయితే, ఈ పత్రికతో ఏమాత్రమూ సంబంధం లేదు గానీ, 1950 ప్రాంతాల్లో "తెలుగు"అనే పేరుతొ మరో పత్రిక వెలువడింది. 1950 లలో వచ్చిన ఈ 'తెలుగు' అనేది పూర్తిగా సినిమా పత్రిక. దాన్ని ఆ రోజుల్లో నిర్మాతా, దర్శకుడూ అయిన కడారు నాగభూషణం గారు ప్రచురించారు. ఈ తెలుగు పత్రిక కూడా ఎక్కువ సంవత్సరాలు కొనసాగిన దాఖలాలు లేవు.

ఇంత వరకూ మనం ఆంధ్ర ప్రాంతాల్లో వివిధ నగరాలనుండి తెలుగు పత్రికలు వచ్చాయని తెలుసుకున్నాం కదా! మరి తెలంగాణా సంగతి ఏమిటి? అప్పటికి తెలంగాణా ప్రాంతాల్లో నైజాం నవాబు పాలనలో 'తెలుగు భాష పరిస్థితి చాలా అధ్వాన్నంగా ఉండేది. పాఠశాలల్లో కూడా ఉర్దూ మీడియంకే ఎక్కువ ప్రాధాన్యత ఉండేది. అలాంటి పరిస్థితిలో తెలుగు మాట్లాడడమే అరుదు. ఇంక పత్రికలు వచ్చే అవకాశం ఎలా ఉంటుంది? అయినా గానీ, తెలుగు భాష అస్తిత్వం కోసం, వ్యాప్తి కోసం పని చేసిన భాషా సేవకులు చాలా మంది తెలంగాణా ప్రాంతాల్లో ఉండేవారు. అలాంటి వాళ్లలో కాస్త చొరవ తీసుకొని ఒక అడుగు ముందుకు వేసి, "తెలుగులో ఒక పత్రికను తీసుకువస్తే బాగుంటుంది"అని, ప్రయత్నాలు మొదలుపెట్టిన వ్యక్తి వి. శ్రీనివాస శర్మగారు.

1913 ప్రాంతంలో మహబూబ్ నగర్ లో ఆ ప్రయత్నాలు ప్రారంభించారు. విచిత్రం ఏమిటంటే ఈ శ్రీనివాసశర్మ తెలుగు వాడు కాదు. ఆయన మాతృ భాష "కన్నడ". అప్పట్లో కొన్ని కన్నడ ప్రాంతాలు కూడా తెలంగాణాలో ఉండేవి. బహుశా అందువల్ల ఆ కన్నడ ప్రాంతం నుండి ఈ శ్రీనివాస శర్మగారి పూర్వీకులు మహబూబ్ నగర్ లో స్థిరపడి ఉండవచ్చు. తెలుగు ముద్రణా యంత్రాలు తెలంగాణాలో ఎక్కువగా అందుబాటులో లేకపోవడం అనే అంశం కూడా పత్రికలు రాకపోవడానికి ఒక కారణం ఐఉండొచ్చు. తెలుగు ముద్రణా యంత్రాలు ఎక్కువగా గద్వాల్, వనపర్తి, ఆత్మకూరు లాంటి సంస్థానాధీశుల దగ్గర మాత్రమే ఉండేవట. అలాంటి పరిస్థితిలో ఈ శ్రీనివాస శర్మ గారు మహబూబ్ నగర్ నుండి పత్రిక ప్రారంభించాలని అనుకున్నారు. ఆ ఆలోచన రాగానే ఆయన ముందుగా చేసినపని. ఆ సంస్థానాధీశులు సంప్రదించే ప్రయత్నం చేయడం.

ఎన్ని సార్లు సంప్రదించినా వాళ్ళ దగ్గర నుండి స్పందన లేదు. అయినా పట్టు వదలకుండా, ఆత్మకూరు సంస్థానానికి, ఎవరో సిఫారసు తీసుకొని వ్యక్తిగతంగా వెళ్లి, "రాజా శ్రీరామ భూపాల మహి బహద్దూర్"గారిని కలుసుకున్నారు. ఆయన శర్మగారు చేస్తున్న ప్రయత్నానికి "సహాయం చేస్తాను "అని వాగ్దానం చేయడమే కాకుండా, తన సంస్థానంలో వున్న ప్రింటింగ్ ప్రెస్ ను కూడా దానంగా ఇచ్చేసారు. ఆ విధంగా ఆ ప్రెస్సును మహబూబ్ నగర్ తీసుకువచ్చి, దానికి "సరోజిని విలాస ముద్రణ శాల"అనే పేరు పెట్టి, అక్కడనుండి తెలంగాణాలో మొట్ట మొదటి తెలుగు పత్రిక "హిత బోధిని" కి శ్రీకారం చుట్టారు.

మొదటి సంచిక 35 పేజీలతో 1913 జూన్ లో ప్రెస్ నుండి బయటకు వచ్చింది. సంవత్సర చందా నాలుగు రూపాయలు. స్త్రీలకూ, విద్యార్థులకు అయితే మూడు రూపాయలు. అయితే, మొదటి సంచికలోనే ఒక విజ్ఞప్తి చేశారు. –మిగతా తెలుగు పత్రికల వాళ్ళందరూ మా పత్రిక గురించి వ్రాసి, అందరికీ తెలిసేలా చెయ్యండి–అని. ఆ 'హితభోధి' ని లో వ్యవసాయమూ, వైద్యమూ, పారిశ్రామిక రంగమూ, ఇలాంటి వ్యాసాలూ. ఒక చిన్న నాటికా, సుభాషితాలూ ఉండేవి. కానీ,శర్మ గారికి రెండో సంచిక నుండే కష్టాలు మొదలయ్యాయి.

ఎందుకంటే, "చందా కడతాము" అన్నవాళ్లందరికి పత్రిక పంపించారు. అయితే, అందులో కొంత మందే పంపించారు. సంపాదకీయంలో రాశారు "దయచేసి మా ప్రయత్నాన్ని బ్రతికించండి. మమ్మల్ని ప్రోత్సహించండి "అని. ఆయన ఎంత బ్రతిమిలాడినా 'హిత బోధిని' కొనే వారి సంఖ్య ఏమాత్రం ప్రోత్సాహకరంగా లేదు. చివరికి vpp లో పంపిన వాళ్ళు కూడా, పత్రిక తీసుకుండా వెనక్కి పంపించేశారు. "కోర్టులో కేసు వేస్తాను" అని హెచ్చరించినా గానీ, ఫలితం లేకుండా పోయింది. పళ్ళ బిగువున 5,6 సంచికలు మార్కెట్ లోకి వచ్చాయి గానీ, ఇక మార్గం లేక ఏడాది లోపే మూసెయ్యాల్సి వచ్చింది. తెలంగాణా నుండి వచ్చిన తొలి తెలుగు పత్రిక 'హితబోధిని ' అలా ముగిసింది.

దీని తర్వాత పత్రిక అని చెప్పలేం గానీ, "దివ్య జ్ఞాన సమాజం" వాళ్ళు వాళ్ళ అంతర్గత సమాచారం కోసమని,ఏదో 4,5 పేజీల బ్రోచర్ లాంటిది తీసుకువచ్చారు.

ఈ ప్రయత్నాల తర్వాత, 1922 ఆగస్టు 24 న నల్గొండ నుంచి "షబ్నవీస్ వెంకట రామ నరసింహారావు "అనే వ్యక్తి నిర్వహణలో "నీలగిరి" అనే పత్రిక మొదలై 4,5 ఏళ్ళు నడిచింది. ఈ పత్రిక గురించి ఎక్కువ వివరాలు లభ్యం కావడం లేదు. ఈ పత్రిక తాలూకా ప్రకటన "ఆంధ్ర పత్రిక' లో వచ్చింది. అయితే, నల్గొండ నుండి నీలగిరి పత్రిక మొదలైన మూడు రోజులకి 1922 ఆగస్టు 27 న "కేసముద్రం "దగ్గర నున్న ఇనుగుర్తి అనే చిన్న పల్లెటూరి నుండి ప్రారంభం అయింది మరో పత్రిక.

దాని పేరు “తెనుఁగు పత్రిక”.  ఇది వార పత్రికగా ప్రారంభం అయింది. దీనికి సారధ్యం వహించిన సోదరుల పట్టుదల  అద్భుతమైన స్ఫూర్తి దాయకమైన కథనం. మహబూబ్ నగర్, నల్గొండ లాంటి పట్టణాలు అంటే కొంతలో కొంత సౌకర్యాలు ఉన్న పట్టణాలు అనుకోవచ్చు. వాటికి దూరంగా “ఇనుగుర్తి”అనే చిన్న పల్లెటూర్లో, పోస్టల్ సదుపాయం గానీ, రవాణా సౌకర్యంగానీ లేని చోటనుండి పత్రికను ప్రారంభించడం అంటే, మాములు విషయం కాదు. ఆ అసాధ్యాన్ని, సుసాధ్యం చేసిన సోదరులే “ఒద్ది రాజు సోదరులు”.

ఒద్దిరాజు సీతారామ చంద్రరావుగారు, ఒద్దిరాజు రాఘవ రంగారావుగారు. వాళ్ళిద్దరినీ కూడా అపూర్వ సహోదరులు అనడానికి అక్షరాలా అర్హులు. ఈ సోదరుల గురించి “తెలంగాణా వేగు చుక్కలు” అనే ప్రత్యేక కార్యక్రమాన్ని 3 భాగాలుగా రెండేళ్ల క్రితమే సమర్పించాను.

110 సంవత్సరాల క్రిందటే నమ్మశక్యం కానీ, అద్భుతాలను ఎన్నింటినో తెలంగాణాలో ఆ మారుమూల గ్రామంలో ఆవిష్కరించారు. ఆ పల్లెటూరులో ఒక ప్రింటింగ్ ప్రెస్ నెలకొల్పడమే కాక స్కూల్ కి వెళ్లకుండా స్వంతగా ఇంగ్లీషూ, తెలుగూ భాషల్లో పాండిత్యాన్ని సంపాదించారు.   ఈ ఒద్దిరాజు సోదరులు బహుముఖ ప్రజ్ఞావంతులు అనడానికి అన్ని విధాలా అర్హులు. ఆ రోజుల్లో వాళ్ళు చేపట్టిన అనేక కార్యక్రమాలతో పాటు, సొంతంగా రచనలు చేయడం కూడా ఒక ప్రత్యేకత. వాళ్ళ పుస్తకాలూ వాళ్ళే అచ్చు వేసుకోవడానికీ, అలాగే ఇతరుల పుస్తకాలు కూడా అచ్చు వేయడానికీ “విజ్ఞాన ప్రచారిణీ గ్రంథ మాల”అనే ఒక సంస్థను1918 లో  స్థాపించారు.

ఒక ఏడాది పాటు వాళ్ళ పుస్తకాలూ, ఇతరుల పుస్తకాలూ బెజవాడా, మద్రాస్ వెళ్లి ప్రింటింగ్ చేయించేవారు. తరువాత ప్రింటింగ్ ప్రెస్ ని మద్రాస్ నుండి వాళ్ళే సొంతంగా కొనుక్కొని వచ్చి, ఆ పల్లెటూరిలో నెలకొల్పారు. అన్ని సొంతంగా ప్రయోగాలు చేసి నేర్చుకోవడమే. కంపోజింగ్, ప్రింటింగ్, బైండింగ్ ఇలాంటివన్నీ కూడా వాళ్ళు ముందు నేర్చుకొని, తరవాత వూర్లో వున్న యువకులకు ఉచితంగా నేర్పి, వాళ్ళకి తమ ప్రెస్ లోనే వుద్యోగం ఇచ్చారు. మళ్ళీ మళ్ళీ మనం గుర్తు పెట్టుకోవలసినది ఇదంతా ఆ “ఇనుగుర్తి “అనే చిన్న పల్లెటూరిలో. వంద సంవత్సరాల క్రిందట జరిగిన అద్భుతం.

అలా ప్రెస్సూ, పుస్తకాల ముద్రణా జరుగుతున్న రోజుల్లోనే, ఒద్దిరాజు సోదరులకు చాలా మంది ప్రముఖులతో పరిచయాలు ఉండేవి. మాడపాటి హనుమంతరావు గారూ, సురవరపు ప్రతాపరెడ్డి గారూ, కోదాటి రామ ప్రతాపరెడ్డి గారూ ఇలాంటి వాళ్ళందరూ కూడా ఒకసారి ఒక ప్రస్తావన తీసుకువచ్చారు.

“మీ దగ్గర ప్రెస్ వుంది. పుస్తకాలు ప్రింట్ చేస్తున్నారు. పైగా మీరు రచయితలు. మీరే ఒక పత్రిక ప్రారంభిస్తే బాగుంటుంది”అని. అలా ప్రారంభం అయింది ఈ “తెనుఁగు పత్రిక”అనే పత్రిక. ఆ ఆలోచన రాగానే వాళ్ళు మద్రాస్ వెళ్లి, కాశీనాధుని నాగేశ్వరావు పంతులు గారితో మాట్లాడారు. అలాగే బందరు వెళ్లి ముట్నూరు కృష్ణారావు గారితో

మాట్లాడారు. వాళ్ళ దగ్గర నుండి పత్రిక నిర్వహణలో సాధక బాధకాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు లాంటి సలహాలే కాకుండా, వాళ్ళ ప్రోత్సాహం, ఆశీస్సులు కూడా తీసుకున్నారు.

వాళ్లిద్దరూ "పత్రిక అంటే, సాధారణమైన విషయం కాదు. పైగా మీరు రాజకీయ వార్తలు కూడా ప్రచురిస్తామని అంటున్నారు. అలాంటివి ప్రచురించినపుడు ప్రభుత్వం నుండి ఇబ్బందులు ఎదురవుతాయి. పైగా మీరు నైజం ప్రభుత్వం ప్రాంతంలో వుంటున్నారు" అని జాగ్రత్తలు కూడా చెప్పారు.

వాటన్నిటినీ గుర్తు పెట్టుకొని, వాళ్లకు అప్పటి వరకు వున్న ప్రెస్ అనుభవాన్ని కూడా సమీకరించుకొని 1922 ఆగస్టు 27 ఆదివారం రోజు మొట్టమొదటి "తెనుఁగు పత్రిక" వార పత్రికను వెలువరించారు. ప్రతి ఆదివారం పత్రికను విడుదల చెయ్యాలని నిర్ణయించుకున్నారు. అసలు ఆ రోజుల్లో పత్రికను ప్రారంభించడమే కష్టం. పైగా వార పత్రిక అయితే ఇంకా పెద్ద సవాలే. సంవత్సరానికి చందా మూడు రూపాయలు. అంత వరకూ బాగానే వుంది. ఆ ఇనుగుర్తిలో పోస్ట్ ఆఫీసు లేదు. మరి పోస్ట్ ఆఫీసు లేకుండా అన్ని ప్రాంతాలకూ పత్రికను ఎలా పంపిస్తారు?

అందుకై సోదరులు ఇద్దరూ తాలూకా కేంద్రానికి వెళ్లి "మా వూరికి పోస్ట్ ఆఫీసు ఇవ్వండి. అలా ఇస్తేనే గానీ మేము పత్రికను నడపలేము" అని ఆ ఆఫీసర్లను ఒప్పించగలిగేరు. కానీ వాళ్ళు "పోస్ట్ ఆఫీసు అయితే, మేము అనుమతి ఇస్తాం. గానీ, పోస్ట్ మాస్టర్ అనే ఉద్యోగాన్ని మాత్రం మేం కల్పించలేం."అన్నారు. "అయినా పర్వాలేదు. మాకు అనుమతి ఇవ్వండి చాలు. మేమే పోస్ట్ మాస్టారు పని చేస్తాం"అని, అక్కడ నుండి పోస్ట్ మాస్టరు పనులు కూడా వాళ్ళే చేస్తూ, పోస్టులో పత్రికను వివిధ ప్రాంతాలకు పంపించడానికి ఏర్పాటు చేసుకున్నారు.

ఇక్కడ వరకు బాగానే వుంది. కానీ, ఆ పల్లెటూరిలో ఉండి వార్తలు సేకరించేవాళ్ళనీ, వార్తలు పంపించేవాళ్ళనీ, చందాదారుల్ని కట్టించేవాళ్ళనీ, ఏజెంట్లనీ వీళ్లందరినీ ఎలా సమీకరించాలి. ఆ ఒద్దిరాజు సోదరులే సైకిళ్ళు వేసుకొని, ఊరూరా వాళ్ళు వెళ్ళ గలిగినంత దూరం వెళ్లి, అన్ని వూర్లలోనూ ఏజెంట్లను పెట్టుకోవడం చేసేవారు. అలాగే వార్తలు ఎలా తీసుకురావాలో ఏర్పాటు చేశారు. అంత నిబద్ధతోటీ, అంత శ్రద్ధ తోటీ ఆ సోదరులు ప్రారంభించిన "తెనుఁగు పత్రిక" మొదట్లో 500 ప్రతులు ప్రచురించేవారు.

అప్పట్లో అంటే 100 సంవత్సరాల క్రిందట తెలంగాణాలో పత్రికలు అనేవే ఎక్కువగా లేని ప్రాంతాల్లో ఆ పల్లెటూరి నుండి 500 కాపీలు ప్రింట్ చేయడం అంటే చాలా గొప్ప విషయం. కొన్నాళ్లకే దాన్ని 1000 కాపీలకు తీసుకువెళ్లారు.

మరి పత్రిక నిర్వహించాలి అంటే దానికి తగిన సౌకర్యాలు ఉండాలి కదా! అందుకోసం వాళ్ళ నాన్నగారు కట్టిన ఇంటి ముందు ఖాళీ ప్రదేశం లో ఒక బంగాళా నిర్మించారు. మరి గదులు గదులుగా ఉంటే కుదరదు కదా! అందుకని పెద్ద హాళ్ల లాగ మూడు అంతస్తులుగా నిర్మించి, అందులో ఒక అంతస్థులో ఈ ప్రింటింగ్ ప్రెస్ పెట్టారు.

మరో అంతస్థులో వాళ్ళ దగ్గరకు ఉచితంగా చదువుకోవడానికి వచ్చే విద్యార్థులకు కేటాయించారు. ఆ పై అంతస్థులో వీళ్ళు ఉండేవారు. సెలవుల్లో అక్షరాలు కూర్చడం, ప్రూఫులు దిద్దడం ఇలాంటి అచ్చు పనులకు సంబంధించిన పనులు తమ దగ్గరకు చదువుకోవడానికి వచ్చిన విద్యార్థులకు నేర్పుతుండేవారు.

ప్రతి ఆదివారం పత్రిక రావాలి అనుకున్నారు కదా! అది వెలువడే ముందు రోజు తెల్లవార్లూ నిర్విరామంగా పని చేసి, పత్రికను పోస్ట్ కు పంపించేటంత వరకూ ఏ మాత్రం తెరిపి లేకుండా ఉండేవారు.

ఇక పత్రికలో అంశాలు ఏమేమి ఉండేవంటే...

12 పేజీల పత్రిక అది. వ్యాసాలూ, రాజకీయ నాయకుల పర్యటన వివరాలూ, పద్యాలూ, కవితలూ ఇలాంటివన్నీ 1 నుండి 5 వరకూ ఉండేవి. 6 వ పేజీ పూర్తిగా సంపాదకీయం. 7వ నైజం దేశం వార్తలు, 8 వ పేజీలో కథలు. వాటిని "వృత్తాంతాలు"అనే వాళ్ళు. 9,10 పేజీల్లో లేఖావళి. అంటే ఎవరైనా రాసిన ఉత్తరాలూ, గ్రంథాలయ వివరాలు ఇలాంటివన్నీ ఉండేవి. 11 వ పేజీలో కలగూరగంప వార్తలు వేస్తుండేవారు.

వాళ్ళ "విజ్ఞాన ప్రచారణీ గ్రంథమాల" ద్వారా ప్రచురిస్తున్న గ్రంథాల వివరాలు కూడా వేసేవారు. వాటి గురించిన ప్రకటనలు కూడా చాలా విచిత్రంగా ఉండేవి "మీరు ఇంకనూ చదలవలేదా?"అని మొట్ట మొదట పేజీలోని వాళ్ళు ప్రచురించిన పుస్తకాల పేర్లు వేస్తుండేవారు. ఇలా మొట్ట మొదట పేజీలోని ప్రకటనలు రావడం అనేది "ఆంధ్ర పత్రిక "నుంచి కూడా కొనసాగుతున్న సాంప్రదాయం. అదే ఇక్కడ కూడా కొనసాగించారు. అలాగే వ్యాసావళి ని ఎవరైనా రాసి పంపించవచ్చు. దాని కింద ఏం రాసారంటే, "ఎవరి వ్రాతకు వారే ఉత్తర వాదులు. సంతకము లేని జాబులు ప్రకటింపబడవు." అని స్పష్టంగా చెప్పారు.

ఆ వ్యాసావళిలో ఆ రోజుల్లో ప్రముఖులైన మాడపాటి హనుమంతరావుగారూ, బూర్గుల రామకృష్ణారావుగారూ, లాంటి వారు కూడా పంపిస్తుండేవారు. పాఠకుల నుండి కూడా ఉత్తరాలు వస్తుండేవి. ఆ ఉత్తరాలు – నల్గొండ, రామ మడుగు, బూర్గుమ్ పహాడ్, మణికొండ, ఇల్లేందు,చిట్యాల, హనుమకొండ, జనగామ, మోదాడ, కద్ది బండ..– ఇలా చాలా మారు మూల ప్రాంతాల నుండి కూడా ఉత్తరాలు వచ్చేవి. అంటే, ఈ పత్రికను మూల మూలలకి తీసుకువెళ్లడంలో ఒద్దిరాజు సోదరులు ఎంత కృషి చేశారో తెలుస్తుంది. ఈ పత్రికలో పద్యాలు రాసేవాళ్లలో అప్పట్లో ప్రముఖ కవులు వి. వెంకట్రామ రాజు, పంతం ఆంజనేయులు నాయుడు, డా:పి.వి. రమణయ్య, పొడిచి సీతారామారావు, మామునూరు నాగభూషణుడు, తిరునగరి జీయర్ స్వామి లాంటివారు ఉండేవారు. ఈ "తెనుఁగు పత్రిక"పాత కాపీలు చూస్తుంటే, చాలా ఆసక్తికరమైన సమాచారం కనపడింది. "నిజాం దేశ వార్తలు "అని హెడ్డింగ్ పెట్టి, ఆ నిజాం దేశంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన వార్తల్ని ప్రచురిస్తుండేవారు. ఎక్కువగా నేరాలూ, ఘోరాలు లాంటివి.

"నిజాం దేశ వార్తలు "

"పేద బిచ్చగత్తె పై ఒక యూరోపియన్ సైనికుడు ట్రక్కులో అత్యాచారం చేసి, బయటకు విసిరేసాడు. ఆమెకు దెబ్బలు తగిలాయి. కొంత మంది భారతీయ పోలీసులు అక్కడే వున్నా, చూస్తూ రక్షించలేకపోయారు. సింహమునకు మేక పిల్లను బలి ఇచ్చినట్లు, చూస్తూ ఉండిపోయారు."

వాళ్ళు దానిమీద స్పందన అంటే వాఖ్యానం కూడా రాశారు – " ఆహా .. గోరుచుట్టుపై రోకటిపోటు అన్నట్లుగా మానభంగమే కాకుండా అరెస్ట్ కూడా చేశారు ఆ అమ్మాయిని. అనుభవించవలసిన దుర్గతి ఆ దీనురాలికి పట్టింది. పట్టపగలు, లజ్జ వీడి, నిర్భయముగా హై రోడ్డున భారతదేశం లోని స్త్రీని పరాభవించుచుండగా,ప్రాణములేని, కొయ్య బొమ్మువలె ఊరకుండుట కన్నా ఆ సోల్జర్ యొక్క గుళ్ల బారికి గురయ్యి వీరేలా చనిపోలేదో? అట్టి రోజునగాని మన భారతీయులకు స్వరాజ్యము రాజాలదు. భారతదేశములో ఇట్టి రాక్షస కృత్యములు యూరోపియన్ సోల్జర్లు చేయుట కొత్త కాదు. ప్రజలు అబలల కంటే అబలలైరి. వీరిలో వీర్యము నశించినది. గుక్కెడు ప్రాణము కొరకు, జానెడు పొట్ట కొరకు, ఎట్టి అమానుషములైననూ సహించు దుర్భర స్థితికి దిగజారితిమి. పరమేశ్వరా! ఎంత ఘోరము ... "

ఈ విధంగా ఏ విషయాన్నయినా "అన్యాయము జరిగింది, న్యాయము జరగలేదు" అనే వార్తలు వాళ్ళ చెవిన పడినప్పుడు, వాళ్ళ వ్యాఖ్యానం కూడా జోడించి వ్రాస్తూండేవారు.

అలాగే "తెనుఁగు పత్రిక"లో వచ్చిన మరికొన్ని ఆసక్తి కరమైన వార్తలు చూద్దాం.

ఒక సంచికలో ఏం రాసారంటే?....

"హైదరాబాద్ ఛాదర్ ఘాట్ నందు "అబ్దుల్ మజీద్ " అను పేరుగల ఒక ఆంగ్లేయ దేశ నివాసియగు మహ్మదీయుడు దొంగ నోట్లు చేయుచుండుట. సికింద్రాబాద్ పోలీసుల వలన నోట్లతో సహా పట్టుబడినాడు"

ఆ రోజుల్లోనే దొంగ నోట్లు అచ్చేయడం వున్నదన్నమాట. మరో వార్త ...

"కొన్ని దినముల క్రిందట ఒక ఆఫ్ఘనీ రాకుమారుడు ఖైరతాబాద్ లో నివసించి వుండేనట. ఆ ఆఫ్ఘనీ రాకుమారునకు ఏదైనా వుద్యోగం ఇచ్చుటకు, ప్రస్తుతము ఏదైనా సహాయము చేయుటకు ఒక వెయ్యి రూపాయలు ఇవ్వవలసినదిగా ప్రభువు వారు ఆజ్ఞ నటులు తెలియ వచ్చినది. మరియు ఆయన ఇచ్చటనే నివసించుదు రనియు, మహ్మద్ ఉమర్ ఖాన్ రాజుగారి కుమారుడని తెలియ వచ్చుచున్నది."

ఆఫ్ఘనిస్తాన్ నుండి ఎవరో రాజ కుమారుడు వస్తే, ఆయనకు ఆరోజుల్లోనే వెయ్యి రూపాయలు ఇవ్వమని నైజాం నవాబు చెప్పేడట. ఇంకొక వార్త...

"మగవాడు ఆడది అగుట "

“ధర్మశాల దగ్గరనున్న భగల్ పూర్ నందు కరుణాకర మహంతి అను నాతడి కుమారుడు కృష్ణ మహంతు అనే నాతడు, ఒక కన్యను వివాహమాడి 35 ఏళ్ళు వయసు వచ్చినప్పటికి ఇరువురు కూతుర్లను కని, ఆకస్మికముగా స్త్రీ అయ్యెను. ఆమె పేరు ఇప్పుడు “హిరణ్మహి”.

1922 ప్రాంతాల్లోనే ఇలాంటివన్ని ఉండేవని ఈ “తెనుఁగు పత్రిక” ద్వారా తెలుస్తున్నది.

అలాగే మరికొన్ని నిజాం దేశవార్తలు “భువనగిరి నందు ఒక ముసలిది చేత నీటి చెంబుతో వీధి వెంట వచ్చుచుండగా, ఆమె బిడ్డ వచ్చి, చేతిలోని చెంబును లాక్కొని, తోసివేసెను. ఆ పెద్దమనిషి కిందన బడి ప్రాణములు విడిచెను”

ఇంకొక వార్త  “హైదరాబాద్ అఫ్జల్ గంజ్ నందు లక్ష్మి సినిమాలో, అందులో ఒక తెలుగు నాటకము నందు భాగము ఫిల్మును ఎవరో ఎత్తుకు పోయినటుల పోలీసు అధికారికి, సినిమా అధికారి తెలిపెను. ఫిల్ములు పెట్టిన గది తాళము వేయబడియే వున్నది. అధికారికి ఇద్దరి, ముగ్గురిపై అనుమానము కలదట. “

అప్పట్లో ఇంకా టాకీ సినిమాలు రాలేదు కదా! ఈ మూకీ సినిమా హాళ్లలోనే నాటకాలు వేసేవాళ్ళు.. ఆ ఫిల్మును థియేటర్ నుండి ఎవరో ఎత్తుకు పోయేరట. అది అప్పట్లో వచ్చిన వార్త.

ఇదే పత్రికలో వచ్చిన మరో రెండు వార్తలు---

“గుల్బర్గా నగరమందలి “ఖడ్గపురా “అను వీధి యందు ఒక మంగలి తన భార్యను ఖండించుచుండగా ఇరువురు ఆడవాండ్లు ఆ స్త్రీని బ్రతికింప వలయునని ఊహతో వారి మధ్యకు రాగా--- వారినీ కత్తి వేటుకు ఎరవేసెనట.” ఇది ఒక నేరం, ఘోరం. అలాగే “గుల్బర్గా జిల్లా అనంతవరము నందు ఒకడు ఇంటిలో పడుకొని యుండగా ఎవరో ఇద్దరు శత్రువులు అతనిని గొడ్డలితో నరికి చంపి నడుములోతు నీటిలో పారవేసిరి “

ఇలా చాలా మారుమూల ప్రాంతాల నుంచి కూడా వార్తల్ని సేకరించేవారు. చాలా ఆశ్చర్యం ఆ పల్లెటూరు నుండి ఎలా చేసేవారో? పైగా వారం...వారం--- పత్రిక తీసుకురావాలనుంటే చాలా ఒత్తిడి ఉంటుంది. అయినా గానీ, వాటినన్నిటినీ అధిక మించి వార్తలని సేకరించి, వాటితో పాటుగా ఉత్తమ సాహిత్యాన్ని కూడా అందించేవారు.

ఒక సంచికలో ఏం రాసారంటే--- “కొన్ని సందర్భాలలో మాత్రమే కొంత ఆలస్యంగా వచ్చింది. పండుగ దినాలలో సైతం ప్రచురిస్తున్నాము. కొడుకు ఉపనయనం. తమ్ముడి కూతురు వివాహం. సోదరుని భార్య చనిపోయిన సందర్భం. ఇలా కొన్ని సార్లు మాత్రమే పత్రిక తీసుకురావడం ఆలస్యం అయింది.  దేవుని కృపవలన రెండేళ్లు గడిచాయి.“ అంటూ వివరణ ఇస్తూ తమ పత్రికలో రాసుకున్నారు. ఆ ప్రెస్ కి ఏదైనా సమస్యలు వచ్చినా, యాంత్రికమైన ఇబ్బందులు వచ్చినా అన్ని వాళ్ళే నేర్చుకొని సరిచేసుకుంటూ పత్రికను క్రమం తప్పకుండా తీసుకువచ్చేవారు.

అలా 3,4 ఏళ్ళు గడిచింది. ఆ తరువాత కొంత మంది పెద్దవాళ్ళు "ఇంత పల్లెటూరిలో ఎందుకు?వరంగల్ వెళదాం. అక్కడనుండి నడిపితే తేలికగా ఉంటుంది." అని బలవంతంగా ఆ ఒద్దిరాజు సోదరులను వరంగల్ కు మార్పు చేయించారు. అక్కడకు వెళ్లిన కొద్ది రోజులకే పత్రికను మూసెయ్యాల్సి వచ్చింది. ఏమైనా గానీ, 4,5 సంవత్సరాలైనా అత్యంత నిబద్ధతోటి, ఆ పల్లెటూరి నుండి పత్రిక నడపడం అనేది సాహసోతమైన కార్యక్రమం. ఇంత చేసి ఈ 4,5 ఏళ్లలో వాళ్లకు మిగిలింది 10 వేల రూపాయల నష్టం. ఆ రోజుల్లో 10 వేల రూపాయలు అంటే మామూలు విషయం కాదు.

ఇవీ తెలంగాణా పత్రిక "తెనుఁగు పత్రిక" విశేషాలు.

తరువాత మనం చెప్పుకోబోయే పత్రిక తెలంగాణా నుండి వచ్చిన ద్వైవార పత్రిక అంటే వారానికి రెండు సార్లు వస్తుంది. అదే "గోలకొండ పత్రిక ". దీనికీ మిగతా పత్రికలకూ వుండే వ్యత్యాసం ఏమిటంటే, ఈ గోలకొండ పత్రిక 40 ఏళ్లపాటు కొనసాగింది. దాని విశేషాలు తెలుసుకుందాం. ఈ గోలకొండ పత్రిక ... కవీ, కథకుడూ, పండితుడూ, పరిశోధకుడూ అయిన సురవరపు ప్రతాపరెడ్డి గారి ఆధ్వర్యములో 1926 లో ప్రారంభం అయింది. 1926 నుండి 40 ఏళ్లపాటు నిర్విఘ్నంగా కొనసాగింది.

మొట్టమొదట్లో ఈ పత్రిక బుధవారం, శనివారం వెలువడేది. కొన్ని సంవత్సరాల తర్వాత సోమవారం, గురువారం వచ్చేది. దానికి కారణాలు కూడా చెప్పారు. ఎందుకంటే ఆదివారం అనేది నైజం ప్రభుత్వ కాలంలో సెలవు దినంగా ఉండేది. అందువల్ల ఈ వారాలు మారుస్తున్నాము అని. 1947 వరకు అంటే 26 సంవత్సరాల పాటు వారానికి రెండు సార్లు వచ్చిన ఈ పత్రిక తరువాత దిన పత్రికగా వెలువడింది.

ఈ గోలకొండ పత్రిక 40 ఏళ్లపాటు సుదీర్ఘంగా నడవడానికి గట్టి పునాది వేసిన సురవరం ప్రతాపరెడ్డి గారి గురించి మనం తప్పకుండా ప్రస్తావించుకోవాలి. సురవరం ప్రతాపరెడ్డి గారిని తెలంగాణా వైతాళికుడు అని కూడా అంటారు. ఆయన 1896 మే 28 వ తేదీన "ఇటికల పాడు" అనే వూర్లో పుట్టాడు. ఆయనకు చిన్నతనం లో ఎక్కాలూ, లెక్కలూ సరిగ్గా వచ్చేవి కావు. కాకపోతే జ్ఞాపకశక్తి బాగా వుండేది. అందుకనే తెలుగు పుస్తకాల్లోని విశేషాలు తొందరగా అర్థం చేసుకోగలిగేవారు. వాళ్ళ నాన్నగారి కంటే వాళ్ళ పిన తండ్రి రామ కృష్ణారెడ్డి గారే ప్రతాపరెడ్డి గారిని చదువులో బాగా ప్రోత్సహించేవారు.

ఆయన ప్రోత్సహంతో హైదరాబాద్ నిజాం కాలేజీ లోనూ, మద్రాస్ లో కూడా ఆయన వున్నత విద్యాభ్యాసం చేసి BA BL పట్టా తీసుకున్నారు. సంస్కృతం మీద ఆసక్తి ఉండేది. మద్రాస్ లో చదువుకునప్పుడు సంస్కృత అధ్యాపకులు కుప్ప స్వామి నాయుడు గారి దగ్గరకు వెళ్లి "నాకు సంస్కృతం నేర్చుకోవాలని వుంది "అన్నారు. దానికి

ఆయన "ముందు నీవు మాంసాహారం తినడం మానేస్తే నేర్పుతాను" అన్నారట. సంస్కృతం నేర్చుకోవడానికి మాంసాహారం మానేసిన పట్టుదల సురవరం ప్రతాపరెడ్డి గారిది.

మద్రాస్ లో చదువుతున్న రోజుల్లోనే సత్యాగ్రహ ఉద్యమం, అహింసా సిద్ధాంతం, ఖద్దరు వస్త్ర ధారణ, ఇలాంటి వన్ని కూడా బాగా ఆకర్షించాయి . హైదరాబాదులో రెడ్డి వసతి గృహం రాజా బహద్దూర్ వెంకట రామి రెడ్డి గారి నిర్వహణ లో ఉండేది. ఆ రాజా వారు, సురవరం ప్రతాపరెడ్డి గారిని, ఆ వసతి గృహం యొక్క యాజమాన్య వ్యవహారాలన్నీ చూసుకోమన్నారు. దాంతో ఆయన మద్రాస్ నుండి హైదరాబాద్ వచ్చేసి, 8 ఏళ్ల పాటు ఆ రెడ్డి వసతి గృహం వ్యవహారాలన్నీ చూసుకున్నారు.

తరువాత వాళ్ళ బాబాయ్ "ఇంత చదువూ, చదువుకొని హాస్టల్ లో ఉండిపోవడం ఏమిటి? కర్నూల్ వెళ్లి న్యాయవాద వృత్తి చేపట్టు"అని చెప్పిన మీదట కర్నూల్ వెళ్లే ప్రయత్నాలు ప్రారంభించారు. అప్పుడు ఆ రాజా వెంకటరామి రెడ్డి గారే చెప్పారు. "నువ్వు చదువుకున్న చదువు కేవలం కోర్టులకే ఉపయోగించడం మంచిది కాదు. నీకు ఇంకా ఉజ్వలమైన భవిష్యత్తు వుంది. హైదరాబాద్ లోనే ఉండిపో! నీకు అంత కంటే ఎక్కువ ఆదాయం వచ్చే మార్గం నేను చూపిస్తాను. "అని ఆయన కోర్టుకు వెళ్లకుండా ఆపారు.

అలా ఆ రోజు అతను ఆపడం అనేది తెలంగాణా లోని తెలుగు భాషా చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయానికి నాంది పలికింది. సురవరం ప్రతాపరెడ్డి గారి చేత అద్భుతమైన పుస్తకాలు రాయించింది. అప్పుడు వెంకట రామిరెడ్డి గారు, ఒక బాధ్యత అప్పజెప్పారు. అదే ఈ "గోలకొండ పత్రిక". అయితే దీనిని 1920 లోనే వెంకట రామిరెడ్డి గారు మొదట్లో కొన్నాళ్ళు నడిపారు. కానీ, ఆ పత్రికను సమర్థవంతంగా నడపలేక,ఆపేసారు. దాన్ని ఇప్పుడు సురవరం ప్రతాపరెడ్డి గారికి అప్పజెప్పారు. ఆయన సంపాదకత్వంలో మొదటి పత్రిక 1926 మే 10 వ తేదీన మార్కెట్ లోకి విడుదల చేశారు.

సురవరం ధైర్యానికి మారుపేరు. ముక్కు సూటిగా వెళ్లే వాళ్ళు. ఏ మాత్రం భయం ఉండేది కాదు. నిజాం ప్రభుత్వానికి పక్కలో బల్లెం లాగా, నిజాం నవాబు కోటికి దగ్గర్లో "ట్రూప్ బజార్"కి దగ్గర్లో ఈ గోలకొండ కార్యాలయాన్ని ప్రారంభించారు. అంతే కాకుండా ఆయన సంపాదకీయం రాసేటప్పుడు ఏ మాత్రం బెదురూ ఉండేది కాదు. నిజాం పరిపాలన యొక్క పరిపాలనని విమర్శించాల్సి వస్తే, నిర్భయంగావిమర్శిస్తుండేవారు.

"తెలుగు భాష యొక్క ప్రచారానికీ, తెలుగు ప్రజల్ని జాగృతం చేయడానికీ, గోలకొండ ప్రారంభించాను"అని ఆయన చెప్పుకున్నారు. నిజాం నిరంకుశ పాలనని విమర్శించడం, అలాగే జమిందార్లూ, దేశ ముఖ్ లూ ప్రజల్ని ఎంతలా పీడిస్తున్నారో తన పత్రికలో రాస్తూండేవారు. ఈ పత్రిక మొట్ట మొదట్లో ఎక్కువ మంది చదవడానికి ముందుకు రాలేదు. ఎందుకంటే, అక్కడ ఉర్దూ పత్రికలే ఎక్కువగా చదివేవాళ్ళు. అయితే, "నిజాం ప్రభుత్వానికి

వ్యతిరేకంగా రాయడంతో పత్రికను మూయించేస్తాం” అని బెదిరింపులు వచ్చేవి. అంతే కాకుండా పత్రికలో రాయడానికి రచయితల్ని కూడా వెతుక్కోవాల్సి వచ్చింది. ఆయనే పత్రికా సంపాదకుడూ, ఆయనే ప్రూఫ్ రీడరూ, అన్ని పనులూ చేస్తుండేవాడు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్ని ఎదుర్కొంటూ పత్రికను నడిపారు.

ఆ పత్రికలో ఎక్కువగా రాజకీయ వార్తలే వస్తుండేవి. సమకాలీన వార్తలూ, తెలంగాణాలో జరుగుతున్న వార్తలూ, నిజాం నవాబు వార్తలూ, వస్తుండేవి. “ప్రజాభిప్రాయ వేదిక” అనే శీర్షికలో ఎవరైనా రాసిన ఉత్తరాల్ని ప్రచురిస్తూ ఉండేవారు. ఆ ప్రజాభిప్రాయ వేదికలో వచ్చే అంశాలలో వివాస్పద అంశాలు ఎక్కువగా ప్రచురించి, పత్రిక యొక్క ప్రచారానికి ఎక్కువగా వాడుకుంటూ ఉండేవారు. ఉదాహరణకు... శాఖాహారం మంచిదా?మాంసాహారం మంచిదా? కృష్ణునికి మీసాలు ఉన్నాయా? స్త్రీలకు స్వాతంత్రం అవసరమా? ఇలాంటి అంశాలను ప్రకటించి ఎవరైనా దాన్ని సమర్థిస్తూ గానీ, విమర్శిస్తూ గానీ రాసినటువంటి ఉత్తరాల్ని కూడా ప్రచురించేవారు.

ఒక్కోసారి ఆయనే కలం పేరుతో వివాస్పదమైన అంశాలు రాసి, చర్చకి తెర తీస్తుండేవారు. ఒకసారి “సంగ్రామ సింహం”అనే పేరుతో “స్త్రీలకు సంపూర్ణ స్వేచ్ఛ అనేది మిథ్య” అని ఒక వ్యాసం రాసి ప్రచురించారు. అది స్త్రీలను చాలా బాధ పెట్టడమే కాకుండా, ఆలోచింప జేసింది. దాంతోటి స్త్రీ పాఠకులు కూడా ఎక్కువ అయ్యారు. ఆ తరువాత “ఆంధ్ర మహిళా సభ” లో ఒక మహిళ అడిగినప్పుడు సురవరం ప్రతాపరెడ్డి గారే చెప్పారు. “నేనే ఆ పేరుతో రాశాను. కనీసం ఆడవాళ్ళలో ఆలోచనా శక్తి పెంపొందించాలనే ఉద్దేశ్యంతో రాసాను. నేను స్త్రీ స్వాతంత్ర్యానికి వ్యతిరేకం కాదు. ”అని.

ఇంకా తన పత్రిక ద్వారా స్త్రీ విద్యా,అంటరాని తనం, మధ్య పాన నిషేధం, వితంతు వివాహాలు ఇలాంటి సాంఘిక సమస్యల పట్ల ప్రజలకు అవగాహన కల్పించడానికి ఎంతగానో కృషి చేశారు. పత్రికలో కేవలం రాజకీయ వార్తలే కాకుండా, సాహిత్యానికి సంబంధించినటు వంటి అంశాలు కూడా చేరుస్తుండేవారు. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని,ఏమాత్రం భయపడకుండా, ఎవరికీ బెదరకుండా “గోలకొండ పత్రిక”కొనసాగించారు. 1947 లో ఆయన పత్రికనుండి బయటకు వచ్చారు. ఆ పత్రికకు తరువాత “ నూకల సర్వోత్తమ రెడ్డి”అనే ఆయన ఎడిటర్ అయ్యారు.

ఆ తరువాత సురవరం ప్రతాపరెడ్డి గారు 1951,1952 ప్రాంతాల్లో “ప్రజావాణి”అనే పత్రికను ప్రారంభించారు. కానీ, అది ఎక్కువ రోజులు నడవలేదు. ఆయన చాలా చిన్న వయసులోనే 1953 ఆగస్టు 27 న తన 57 సంవత్సరాల వయసులో మరణించారు. ఏమైనా గానీ, ఆ సురవరం ప్రతాపరెడ్డి గారు ప్రారంభించిన ఆ “గోలకొండ”పత్రిక ఇప్పటికీ చారిత్రాత్మక ప్రాధాన్యతను కలిగివున్నది. తెలంగాణాలో తెలుగు ఉద్యమాల గురించి మాట్లాడుకుంటున్నప్పుడు, గోలకొండ పత్రిక గురించి మాట్లాకుండా ఉండలేము. ఇప్పటికి కూడా వెనక్కి వెళ్లి 40 సంవత్సరాలు నడచిన ఆ గోలకొండ పత్రిక ను చదువుతుంటే, ఆ రోజుల్లో హైదరాబాద్ భాష ఎలా ఉండేది? ఆ

హైదరాబాద్ ప్రాంతాలలో తెలుగు వారి ఇబ్బందులు ఎలా ఉండేవి?అనేవి స్పష్టంగా తెలుస్తాయి. ఇవండీ గోలకొండ పత్రిక విశేషాలు.

దీని తర్వాత మనం విశేషాలు తెలుసుకోబోయే పత్రిక "త్రివేణి"తెలుగు పత్రికా లోకంలో ఒక ప్రత్యేక స్థానం వున్న పత్రిక ఈ "త్రివేణి". ఎందుకంటే, తెలుగు సాహిత్యం గురించి, ఇంగ్లీష్ లో వచ్చిన పత్రిక ఇది. దాదాపుగా 90 సంవత్సరాలుగా నడుస్తున్నది. తెలుగులో ఉత్తమ సాహిత్యాన్ని, కథలూ, వ్యాసాలూ, కవితలూ వీటన్నిటిని ఆంగ్లంలోకి అనువాదం చేసి, విభిన్న వర్గాల పాఠకులకు చేరేలాగా చూడడమే ఈ త్రివేణి పత్రిక ముఖ్య ఉద్దేశ్యం.

"త్రివేణి"అంటే మూడింట సంగమం కదా! ఆ మూడూ ఏమిటంటే, ఆర్ట్, లిటరేచర్,&హిస్టరీ. ఈ మూడు రంగాల గురించిన అంశాలు ఆంగ్లంలో ప్రచురించిన పత్రిక "త్రివేణి". భారతీయ సాంస్కృతిక పునరుజ్జీవనం కోసం అనేది ఈ త్రివేణి యొక్క టేగ్ లైన్.

ఈ త్రివేణి ఆంగ్ల పత్రికను స్థాపించినది కోలవెన్ను రామ కోటేశ్వరావుగారు.. మొట్ట మొదటి సంచిక 1928 జనవరిలో విడుదల అయ్యింది. ప్రారంభంలో – రెండు నెలలకి ఒకసారి,అంటే సంవత్సరానికి ఆరు సంచికలు– అని ప్రకటించారు. మొట్టమొదటి సంచిక మద్రాస్ నుండి వచ్చింది. కోలవెన్ను రామ కోటేశ్వరావు గారు ఈ పత్రికకు రాకముందు బందరులో ఆంధ్ర జాతీయ కళాశాలకు వైస్ ప్రిన్సిపాల్ గా పనిచేసేవారు. త్రివేణి పత్రిక ఆయన మానస పుత్రిక.

అయితే, ప్రారంభంలో ఆయనకు సహాయకులుగా పనిచేసిన వాళ్ళు – అడవి బాపిరాజు గారూ, రాజా భూషణరావు గారూ. 1928 వ సంవత్సరం అంటే, ఆంగ్ల భాషా ప్రభావం ఎక్కువగా వుంది. అలాగే ఆంగ్ల భాష చదువుకున్న వాళ్ళు కూడా ఎక్కువ మందే వున్నారు. అందువల్ల పరిమిత సంఖ్యలోనే అయినా గానీ, ప్రామాణికమైన పత్రికగా పేరు తెచ్చుకుంది. అంతకు 4 సంవత్సరాల ముందే ప్రారంభమైన "భారతి"తెలుగు సాహిత్య మాస పత్రిక ఎలాంటి పేరు తెచ్చుకుందో, ఇంగ్లీష్ మాధ్యమం లో త్రివేణి అలాంటి పేరు తెచ్చుకుంది.

6 ఏళ్ళ పాటు రెండు నెలలకి ఒకసారి వచ్చేది. 1936 నుంచి 1940 వరకూ మాస పత్రికగా వచ్చింది. 1940 నుంచి సంవత్సరానికి 4 సంచికలుగా మారింది. చాలా దశాబ్దాల పాటు రామకోటేశ్వరావు గారే ఈ పత్రికకు సంపాదకులుగా వున్నారు. కొన్నాళ్ళకు మద్రాస్ నుండి కార్యాలయాన్ని బందరుకి మార్చారు. రామానాయుడు పేటలో త్రివేణి ప్రింటింగ్ ప్రెస్ అని, త్రివేణి బుక్ స్టోర్ అని ఉండేది.

నేను చదువుకున్న రోజుల్లో ఆ బుక్ షాపు నుండే తెలుగు పుస్తకాలు కొనుక్కునేవాడిని. కోలవెన్ను రామకోటేశ్వరావు గారి తర్వాత "భావరాజు నరసింహరావుగారు"అనే ఆయన త్రివేణి పత్రికకు సంపాదకులు అయ్యారు. 1990 ప్రాంతాల్లో కొన్నాళ్ళు గుంటూరు నుండి కూడా వచ్చింది ఈ పత్రిక. అప్పుడు భావరాజు

నరసింహారావుతో పాటుగా గుంటూరులో వున్న రవీ ట్యుటోరియల్ c. v. n ధన్ గారు కూడా సహ సంపాదకులుగా ఉండేవారు ఈ పత్రికకు. తర్వాత i.v. చలపతిరావుగారు అనే ఆయన సంపాదకులు అయ్యారు. 2013 ప్రాంతాల్లో హైదరాబాద్ నుండి వచ్చేది ఈ త్రివేణి పత్రిక. 2018 వరకు కొనసాగినట్లుగా అంతర్జాలం లో సమాచారం. బహూశా ఇప్పుడు కూడా కొనసాగుతున్నదేమో?

ఎలా చూసినాగానీ, కృష్ణా పత్రిక తర్వాత సుదీర్ఘ కాలం కొనసాగిన, తెలుగు వారి సంపాదకత్వం లో వచ్చిన ఆంగ్ల పత్రిక "త్రివేణి"తన ప్రత్యేకతను నిలబెట్టుకుంటూ కొనసాగింది. త్రివేణి పత్రికతో నాకున్న జ్ఞాపకాన్ని చెప్పి ముగిస్తాను.

1978 లో నేను రాసిన ఒక మినీ కవిత బాపుగారి బొమ్మతో కలిపి ఆంధ్ర జ్యోతి వార పత్రికలో వచ్చింది.1980 చివరిలో త్రివేణి పత్రిక కార్యాలయం నుండి నాకు ఒక కార్డు వచ్చింది. అది i.v. చలపతిరావు గారు రాసారు

"మీరు ఆంధ్ర జ్యోతి లో రాసిన మినీ కవిత బాగుంది. దాన్ని ఆంగ్లం లోకి అనువాదం చేసి, త్రివేణి పత్రికలో ప్రచురిస్తాము. మీ అనుమతి కావాలి"అని. అప్పుడు నేను చాలా చిన్న పిల్లవాడిని. ఆశ్చర్యపోయాను. ఇంత నిబద్ధతోటి, కేవలం పది పంక్తులు వున్న కవితను అనువాదం చేయడానికి కూడా అనుమతి తీసుకుంటున్నారు అని . దాన్ని ఆంగ్లంలోకి వాళ్ళే అనువాదం చేసి, 1981 జనవరి–మార్చి మూడు నెలలకు వచ్చే త్రివేణి పత్రికలో ప్రచురించారు. ఇవి త్రివేణి పత్రిక విశేషాలు.

ఆ తరువాత చెప్పుకోదగినది అదే రోజుల్లో ప్రారంభమైన మాస పత్రిక "గృహ లక్ష్మి". తెలుగు సాహిత్యంలో గృహలక్ష్మి పత్రికకు చాలా ప్రత్యేకతలు వున్నాయి. ఈ పత్రిక స్థాపకులు డా: కె. ఎన్. కేసరి గారు. డాక్టర్ అంటే, ఆయుర్వేద వైద్యుడు. లోధ్ర, అమృత, ఆర్క ఇలాంటి ఆయుర్వేద మందుల్ని తయారుచేస్తుండేవాడు. మద్రాస్ లో కేసరి విద్యా సంస్థల్ని ప్రారంభించింది కూడా ఈయనే. 1940 ప్రాంతాల్లోనే స్త్రీ విద్యను ప్రోత్సహిస్తూ మహిళా కళాశాలల స్థాపన కోసం లక్షలాది రూపాయలు విరాళాలు ఇచ్చిన దాత కేసరి గారు.

ఆయన గురించి కూడా చాలా రోజుల క్రిందటే రెండు భాగాల కార్యక్రమాన్ని సమర్పించాను. చాలా స్ఫూర్తి దాయకమైన జీవితం కేసరి గారిది. అనాథగా మద్రాస్ లో అడుగు పెట్టి, స్వయం శక్తితో ఎదిగిన వ్యక్తి. తానూ నడచి వచ్చిన దారుల్ని మరచిపోని వ్యక్తిత్వం. స్త్రీలకు సంబంధించిన ఔషధాలవల్ల ధనవంతుడయ్యారు కాబట్టి స్త్రీల సౌభాగ్యం కోసం ఏదైనా మంచి కార్యక్రమం చేపట్టాలి అనే ఆశయంతో ఈ "గృహ లక్ష్మి"పత్రికను ప్రారంభించాడు. ఆయన పెద్దగా చదువుకోలేదు. కానీ, ఆయనకున్న వ్యాపార సామర్థ్యం, మంచిపని చెయ్యాలనే సంకల్పం, ఆయనతో ఈ "గృహ లక్ష్మి"అనే పత్రికను ప్రారంభించేలా చేసింది.

1928 మార్చిలో మొట్టమొదటి సంచిక వెలువడింది. దాని కోసమని ఆయన ఒక ప్రెస్ కూడా పెట్టుకున్నారు. దాన్ని "లోధ్ర" ప్రెస్ అనేవాళ్ళు. ఆ పత్రిక ఆశయాన్ని "స్త్రీల ఆరోగ్య, సౌభాగ్యములను పెంపొందించుటకు ఏర్పడిన సచిత్ర మాస పత్రిక." అని రాశారు. మొదటి సంచిక నుంచే "శారద లేఖలు"అనే శీర్షికను ప్రారంభించారు. మధ్య మధ్యలో ఆగుతూ వచ్చినా గానీ, ఈ శారద లేఖలు అనే శీర్షిక ఆరోజుల్లో పెద్ద సంచలనం అయ్యింది. ఎందుకంటే ,అది రాసిన "శారద"అనే ఆవిడ ఎవరో చాలామందికి చాలా రోజుల వరకూ తెలియలేదు. తరవాత తెలిసింది బాపట్ల లో వుండే "కనుపర్తి వరలక్ష్మమ్మ " ఆ శారద పేరుతో ఉత్తరాల్లాటి వ్యాసాలు రాసారు అని. కనుపర్తి వరలక్ష్మి గారి గురించి కూడా లోగడే ఒక ప్రత్యేకమైన కార్యక్రమాన్ని చేసాను.

కొనేళ్ల తరవాత ఈ కనుపర్తి వరలక్ష్మి గారినే గృహలక్ష్మి సలహా మండలిలో సభ్యురాలిగా కూడా చేర్చుకున్నారు కేసరి గారు. ఆనాటి తెలుగు సాహిత్యం గురించి మాట్లాడుకున్నప్పుడు గృహలక్ష్మి పత్రిక ప్రసక్తి తప్పకుండా వస్తుంది. ఆ రోజుల్లోనే ప్రముఖులు విశ్వనాథ కవిరాజు, బుచ్చిబాబు, కవికొండల వెంకటరత్నం, ఇలాంటి వారి రచనలు తరచూ ఈ గృహలక్ష్మి పత్రికలో వస్తుండేవి. ఈ పత్రికల్లో వచ్చే చాలా అంశాలు ఇతర చాలా పత్రికల కంటే భిన్నంగా ఉండేవి. విశిష్టంగానూ, ప్రామాణికంగానూ ఉండేవి. కధలూ, వ్యాసాలూ, కవిత్వం వీటితో పాటుగా సమకాలీన వార్తలూ, స్త్రీల ఆరోగ్యం గురించి, వాళ్లకు విజ్ఞానం అందించే వ్యాసాలూ ఎక్కువగా ఉండేవి. 1930 ప్రాంతాల్లో ఈ పత్రికకు ప్రజాకవి "గరిమెళ్ళ సత్యన్నారాయణ గారు" సంపాదకుడిగా పనిచేశారని అక్కడక్కడా రాసి వుంది.

ఈ పత్రిక మరో ప్రత్యేకత, కేసరి గారి దాతృత్వానికి ఇంకో ఉదాహరణ ఏమిటంటే, ఈ పత్రిక తరపున కేసరిగారు స్థాపించిన "గృహ లక్ష్మి స్వర్ణ కంకణం"అనే పురస్కారం. ప్రతి సంవత్సరం సాహితీ, సాంస్కృతిక, సాంఘిక రంగాల్లో విశిష్ట సేవ చేసిన మహిళల్ని సంవత్సరానికి ఒకరిని ఎంపిక చేసుకొని, వాళ్లకి భారీ ఎత్తున సన్మానం చేసి, బంగారు కంకణాన్ని బహుకరిస్తూ ఉండేవారు. 1934లో మొట్టమొదటి సారిగా ఈ గృహలక్ష్మి స్వర్ణ కంకణాన్ని అందుకున్న విదుషీమణి కనుపర్తి వరలక్ష్మమ్మగారు. 1934 నుంచి సుమారుగా 56 సంవత్సరాల పాటు అంటే 1990 వరకు ఈ గృహలక్ష్మి స్వర్ణకంకణ ప్రదానం కొనసాగడం అనేది డా: k.n. కేసరి గారు వేసిన బలమైన పునాదికి, ఆయన ముందు చూపుకి ఒక ఉదాహరణ. 1953లో కేసరిగారు మరణించినప్పటికీ, "గృహ లక్ష్మి "పత్రిక ఆగకుండా ఆ తరువాత ఒక దశాబ్దం పాటు అదే విలువలతో, అదే ప్రమాణాలతో కొనసాగింది.

కేసరిగారు చనిపోయాక, సి.సి. పున్నయ్య గారు ఎడిటర్ గా డా:ఎస్. శేషగిరిరావు పబ్లిషర్ గా కొనసాగింది. దాదాపుగా 4 దశాబ్దాలు కొనసాగిన గృహ లక్ష్మి 1960 ప్రాంతాల్లో ఆగిపోయింది.

ఇవండీ గృహలక్ష్మి మాస పత్రిక విశేషాలు.

ఇక్కడితో ఈ భాగాన్ని ముగిద్దాం.

మరిన్ని విశేషాలు తరవాత భాగంలో ....

అక్షరీకరణ – వి. వెంకటరావు

2020 ఆగస్టు25 న, ప్రసారమైన ఈ టాక్ షోని ఇక్కడ వినవచ్చు

COMMENTS

కౌముది